**కామెడీ కథ**

# కుక్కరోక్కో

**సి.వి.నరసింహదాసు**

**పట్టాభి కథ పత్రికలో పడింది. తను ప్రేమించిన అమ్మాయి, అందునా స్వయానా తన మేన మామ ఒక్కగానొక్క ఏడో కూతురు, నూట పదహారు ప్రేమలే ఖలు వ్రాయించుకున్నాక ఆఖరి అర్జీని ఆమోదించి పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినరోజు కూడా అంత సంతోషపడి వుండడు పట్టాభి.**

తను అభిమానించే ఆ పత్రికలో కథ పడాలని పుట్టి బుద్ధెరిగినప్పట్నుండి విశ్వప్రయత్నాలు చేసి, ఆఖరికి తాటికాయంత అక్షరాల్లో మొట్టమొదటిసారి తన పేరు అచ్చులో చూసి మురిసిపోతున్న పట్టాభి ప్రస్తుతం నేలకి ఆరంగుళాల ఎత్తులో గాలిలో నడుస్తున్నాడు.

ఆఫీసు ఆఫీసంతా అదే అలికిడి. వేడి వేడి చర్చలు... ప్రతి ఒక్కరు మనసులోనే కుళ్ళుకు ఛస్తున్నారు. తమని తామే తీవ్రంగా ప్రశ్నించుకుంటున్నారు. "ఎలా వేసే శార్రా! అసలా కథలో అంత గొప్పతనం ఏం ఏడ్చిందిరా!"

పైపైకి మాత్రం లైన్లో నిల్చుని వంతులవారీగా పట్టాభిని కౌగలించుకుని ఆనందభాష్పాలు రాలుస్తూ అభినంద నల్లో ముంచెత్తుతున్నారు.

పన్లో పనిగా ఈ కౌగిలింతల పర్వంలో స్టెనో మిసెస్ ముక్తీదీక్షిత్ కూడా పాలుపంచుకుంటుందేమోనని ఆశగా చూశాడుగానీ, ఆవిడగారు సీటు కదలకుండానే "పార్టీ ఇచ్చేదేం లేదా మిస్టర్ పట్టాభి" అంది, మార్గరెట్ థాచర్ స్టైల్లో మాట్లాడాలని ప్రయత్నిస్తూ. ఆమె ఈమధ్య 'రేపి డెక్స్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్' రహస్యంగా బట్టీపడుతు న్నట్టు అనధికార భోగట్టా.

అంతే! మిగతావారంతా ఒక్కసారిగా వారం రోజు ల్నుంచి ఆకలితో నకనకలాడుతున్న వేటకుక్కల్లా పైనబ డ్డారు, పార్టీ కోసమని, ఈ లోకంలో పాపాత్ములకి, పార్టీ అడిగేవారికి లోటులేదని నిరూపిస్తూ.

"అబ్బే..ఇంటింటికో రచయిత కుక్కగొడుగుల్లా పుట్టు కొస్తున్న ఈ రోజుల్లో నాదేమంత గొప్ప ఎచీవ్‌మెంటని?" సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ అన్నాడు పట్టాభి. కథ పడ్డ ఆనందం కాస్తా పార్టీ కోసమయ్యే ఖర్చును తలచుకోగానే ఆవిరైపోతోంది. జీతాలొచ్చి పదిరోజులే అయినా ప్రస్తుతం లోటు బడ్జెట్‌లో నడుస్తోంది వ్యవహారం.

"హన్నన్నా..మిమ్మల్ని మీరలా కించపరచుకోకండి గురూగారూ..ఎంత రచయితలు తామర తంపరగా పెరిగిపోతున్నా, కొందరు ఎడిటర్లు ఆస్థాన రచయితల్ని మాత్రమే ప్రోత్సహిస్తున్న ఈ కాలంలో, ఒక బైటి వ్యక్తి కథ, అందులోనూ ఓ మగాడి కథ, మగ పేరుతో పడటం.. వారెవ్వా.. ఎంత క్రెడిటండి బాబూ.." రెచ్చగొట్టాడు, పత్రి కల పుట్టు పూర్వోత్తరాల గుట్టుమట్లన్నీ తన గుప్పెట్లో వున్నాయని ఎప్పుడూ చెప్పుకు తిరిగే సంజీవరావు.

"కానీ...ఇంకాసేపటిలో బాస్ వస్తారు గదా!" అప్పటి దాకా గండం నుండి గట్టెక్కించమని శతకోటి దేవుళ్ళకి మొక్కుకుంటూ, సాకుల కోసం వెదుక్కుంటున్నాడు పట్టాభి.

గొల్లుమని నవ్వారంతా.

"కథ పడగానే జ్ఞాపకశక్తిగానీ తగ్గిందేమిటయ్యా.. ఎప్పుడూ ఆఫీసుకి అరగంట ముందే దిగబడి అందరి మీదా రంకెలు వేసే మొగుడు, పది దాటి పది నిమిషా లైనా యింకా రాలేదంటే అర్థం ఏమిటి? ఈరోజు మధ్యాహ్నం ముంబైలో జనరల్ బాడీ మీటింగ్ వుందని నిన్న రాత్రి పదింటిదాకా ఫైల్స్ సిద్ధం చేయమని మనల్ని పరుగులు పెట్టించిన విషయం మర్చిపోయావా? ఈ పాటికి ప్లేన్ ఎక్కేసుంటాడు గురుడు. నువ్వేం వర్రీ కాకు" అలవాటుగా భుజం మీద చరిచి భరోసా ఇచ్చాడు హెడ్‌గుమాస్తా హరిశ్చంద్రరావు.

పట్టాభి గొంతులో పచ్చివెలక్కాయ పడింది. పార్టీ తప్పించుకునే దారులన్నీ మూసుకుపోయాయి.

ఓ వెర్రి నవ్వొకటి విసిరి, జేబులోంచి ఓ యాభై నోటు తీసి అటెండర్ చేతికిచ్చాడు.

పది నిమిషాల్లో ఏర్పాట్లు సిద్ధమైపోయాయి.

"బోలో పట్టాభి రామారావ్‌కీ..జై" ఓ పేపర్ ప్లేట్‌లో మిక్చర్, స్వీట్ అందుకుంటూ అరిచాడు, కాలేజీ రోజుల్లో యూనియన్ లీడర్ అంబాజీరావు.

అందరూ కోరస్‌గా 'జై..జై' మన్నారు.

"పట్టాభి"

"జిందాబాద్"

ఒక్క పట్టాభి తప్ప అందరూ ఆనందంగా సెలబ్రేట్ చేసుకుంటున్న ఈ శుభతరుణంలో, వికృతంగా వినిపిం చిందొక ఆర్తనాదం.

ఉలికిపాటుతో మెయిన్‌గేట్ వైపు చూశారందరూ. అక్కడ ఓ అరడజను కుక్కలు మొరలెత్తి ఏడుస్తున్న ఎఫె క్ట్‌తో వింత వింత శబ్దాలు చేస్తున్నాడు అటెండర్ అప్పా రావు.

అది సిగ్నల్. దాని అర్థం ప్రతి ఒక్కరికి తెలుసు.

"ఎక్కడో నా అంచనా తప్పిందోయ్" పాలిపోయిన ముఖంతో అన్నాడు హరిశ్చంద్రరావు. అనర్థం జరిగిపో యింది. హాల్లో హఠాత్తుగా ప్రత్యక్షమైన బాస్ బ్రహ్మానం దాన్ని చూసి బిక్కచచ్చిపోయారు.

"వాటీజ్ దిస్. ఆఫీసులో ఏమిటీ కచేరీ?" ఫేన్ గాలికి టేబిల్ పైన ఎగురుతున్న సగం ఖాళీ చేసిన ప్లేట్లని చూస్తూ గర్జించాడు బ్రహ్మానందం.

సమాధానం చెప్పే ధైర్యం ఎవరికీ లేదు.

"ఐ వాంట్ ఆన్సర్.." హాల్ ఎగిరిపోయేలా అరిచాడు. బాస్‌కి సమాధానమిచ్చే సాహసం వుంటే గింటే అది ఒక్క అప్పారావుకే.

అందరూ జాలి జాలిగా తనకేసే చూడటం గమనించిన అప్పారావు ముందుకొచ్చి "పార్టీ సార్" అన్నాడు, చిన్నగా గొణుగుతున్నట్టుగా.

'ఈ కచేరీకి కారణం ఏమిటి?' ఉరమబోయిన బ్రహ్మా నందానికి అంతలోనే ఏదో అనుమానం వచ్చింది.

వీళ్ళంతా ఖుషీగా కచేరీ పెట్టుకున్నారంటే, కొంపతీసి తనకిగాని ట్రాన్స్‌ఫర్ అయిపోలేదు గదా!

అంతే! సుడిగాలిగా తన గదిలోకి దూసుకుపోయాడు బ్రహ్మానందం. ట్రేలో తనకొచ్చిన టపా నీట్‌గా పేర్చివుంది.

గబగబా మొత్తం ఓమారు కెలికేశాడు. తనకి ట్రాన్స్‌ఫర్ లాంటి ఉపద్రవమేదీ లేదని నిర్ధారణ చేసుకున్నాకగానీ కుదుటపడలేదు మనసు.

మరి కచేరీ?

బెల్ కొట్టి అందర్నీ లోనికి పిలిచాడు.

"చెప్పండి..ఎవరిదీ కచేరీ?"

బాస్ గొంతులో ఇంతకు ముందంత కాఠిన్యం తొంగి చూడకపోవడం గమనించి, హరిశ్చంద్రరావుకి కాస్త ధైర్యం మొచ్చి గొంతు సర్దుకున్నాడు.

"మన పట్టాభి కథ ఫస్ట్ టైమ్ పత్రికలో పడింది సార్. ఆ సందర్భంగా.." అంతకన్నా తమకు వేరే దురుద్దేశాలేం లేవనడానికి సాక్ష్యంగా వీక్లీ తీసి బాస్‌కి చూపించాడు.

యధాలాపంగా మొదటి పేరా చదివిన బ్రహ్మానందం, అక్కడితే ఆగక మొత్తం కథ చదవసాగాడు. క్రమంగా బాస్ ముఖంలో మారుతున్న రంగుల్ని చూస్తుంటే పట్టాభి అర చేతులు చెమటతో తడిసిపోతున్నాయి.

"సరే..మీరు వెళ్ళండి"

బ్రతుకుజీవుడా అనుకుంటూ బైటకు రాబోతున్న పట్టాభి గుండె మరోసారి ఆగిపోయింది, తనొక్కడిని ఆగ మన్న బాస్ ఆజ్ఞతో.

'బహుశా బాస్‌కి కథలన్నా, కథల్రాసేవాళ్ళన్నా ఒళ్ళు మంటయి వుంటుంది. ఈ దెబ్బతో తన పని అవుట్.



అసలే

తనకి ప్రమోషన్ డ్యూ. గుడ్‌విల్ కోసం నానా పాట్లూ పడుతున్న తరుణంలో తనిలా రెడ్ హాండెడ్‌గా పట్టుబడి పోవడం.. ఛీ..ఇక జన్మలో కథల్రాయనని బాస్ కాళ్ళమీద పడి చెప్పేయాలి' మెంటల్‌గా తనను తాను సిద్ధం చేసుకుంటున్న పట్టాభి, హఠాత్తుగా తన చేతుల్నెవరో పిండిమరలో పెట్టి క్రష్ చేస్తున్నట్టుగా విలవిల లాడిపోయాడు.

అతడి చేతుల్ని పట్టుకొని ఊపేస్తున్నాడు బ్రహ్మానందం.

"నీలో ఇంత ప్రతిభ దాగి వుందని నాకింతకాలం తెలీదోయ్. రియల్లీ అయాం ప్రౌడాఫ్ యూ మైబోయ్. నీకు ఒక్కసారిగా పాతిక ఇంక్రిమెంట్లు, డబుల్ ప్రమోషన్ ఇమ్మని ఈరోజే రికమెండ్ చేస్తా.."

ఈ అకాల అవార్డుల వర్షానికి అవాక్కయిపోయిన పట్టాభికిదంతా కలయో, నిజమో, బాసుడి మాయో అర్థంకావడం లేదు. అసలు తనున్నది ఆఫీసులోనా లేక రాత్రి నిద్రలోనే టపా కట్టేసి వేరే లోకంలోనా అన్న అనుమానం కూడా రాకపోలేదు.

"అరె..నిలబడే వున్నావా? కూర్చోవోయ్. చెప్పు ఏం తీసుకుంటావ్. కాఫీ టీ బ్రూ బూస్ట్ కూల్‌డ్రింక్ ఏమన్నా?"

పట్టాభిలో చలిజ్వరం ప్రారంభమైంది.

"తనని విషప్రయోగం చేసి దారుణంగా చంపేయడానికి బాస్‌కిది వెరైటీ ప్రయత్నం కాదుకదా!"

ఫ్రిజ్‌లోంచి రెండు కూల్‌డ్రింక్ బాటిల్స్ తీసి స్వయంగా తనే ఓపెన్ చేసి ఒకటి పట్టాభి ముందుకు తోశాడు బ్రహ్మానందం.

"అబ్బే వద్దుసార్.." కంగారుగా అన్నాడు పట్టాభి. అవసరమైతే ప్రాణరక్షణార్థం తలుపు తోసుకుని బైటకి పారిపోయే పరిస్థితుల్ని అంచనా వేసుకుంటూ.

"నువ్వో చిన్న హెల్ప్ చేయాలోయ్"

చురుగ్గా బాస్‌కేసి చూశాడు పట్టాభి.

"మా సిల్లీ కనిపించడం లేదోయ్.." అసలు కథకి ఉపోద్ఘాతంగా చెప్పాడు బ్రహ్మానందం, డ్రింక్ ఓ సిప్ లాగి.

"సిల్లీ అంటే మీ కుక్కాసార్!" కొద్దిగా నోరు విప్పాడు పట్టాభి. తనెంత తప్పుగా మాట్లాడాడో, ఓ సెకను తర్వాత తెలిసింది.

చురుగ్గా కళ్ళు చికిలించాడు బ్రహ్మానందం.

"బొత్తిగా 'కుక్కా' అంటూ అలా తీసి పడేస్తావేం. కాస్త మర్యాద యివ్వలేవూ?" కయ్యిమన్నాడు.

'ఓహో..కుక్కగారు అనాలి కాబోలు' మనసులోనే అనుకున్నాడు పట్టాభి.

"ఉదయం ఐదు గంటలకి పాలవాడు వచ్చేటప్పటికి వుందయ్యా. ఆ తర్వాత పేపర్ వాడొచ్చేసరికి కనిపించడం లేదు. అప్పటినుండి మా ఆవిడ పచ్చి మంచినీళ్ళు అయినా ముట్టకుండా బెంగతో కుమిలిపోతోంది. నీకు తెలుసుగా. ఈరోజు మధ్యాహ్నం నేను మీటింగ్‌కి ఎటెండవ్వాలి. కొన్ని అర్జెంట్ పేపర్స్ మర్చిపోయాను. అవి తీసుకెళ్ళేందుకే ఆఫీసుకొచ్చాను. లక్కీగా నీ గురించి తెలిసింది. మా ఆవిడకి మాటిచ్చానయ్యా. రేపుదయానికల్లా సిల్లీ మళ్ళీ ఇంట్లో వుంటుందని. నేను కూడా ముంబై నుండి రేపు ఉదయానికల్లా వచ్చేస్తాను. ఈలోగా నువ్ కాస్త మా సిల్లీని వెదికిపెట్టాలి."

"కానీ..నేను?" ఏదో చెప్పబోయాడు పట్టాభి.

"నాకు తెలుసోయ్..నీది డిటెక్టివ్ బుర్రని. ఎంత చక్కటి డిటెక్టివ్ కథ రాశావోయ్. నీలాంటి అత్యుత్తమ డిటెక్టివ్‌కి ప్రమోషనివ్వాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోందోయ్"

పట్టాభి కర్థమైపోయింది. సిల్లీని పట్టుకోవడానికి, తన ప్రమోషన్‌కి బాస్ లింక్ పెట్టేశాడని. కాని బొత్తిగా కుక్కని వెదకడం.. సిల్లీ..

"ఈ రోజుకి నీకు ఫ్రెంచ్‌లీవ్ శాంక్షన్ చేస్తున్నాను తీసుకో. కాని గుర్తుంది గదా. రేపుదయం ఆరుగంటల కల్లా సిల్లీ నాకు కనబడాలి"

అది అభ్యర్థనో, ఆజ్ఞో అర్థం కాలేదు పట్టాభికి. తను ఉద్యోగంలో చేరినప్పుడు ఇలా బాస్‌ల తప్పిపోయిన కుక్కల్ని, పిల్లుల్ని, పందుల్ని వెదికిపెట్టాలనే కండిషన్ మీద సంతకం లాంటిదేమీ పెట్టిన గుర్తులేదు.

అలాగని తనవల్ల కాదని తెగేసి చెప్పేద్దామా అంటే కళ్ళ ముందు కదులుతున్న ప్రమోషన్. మరో పదో, పాతికో జీతం పెరిగితే పిల్లగాడికి పాలఖర్చులకైనా సరిపోతాయి.

"సరే సార్..కానీ" ఏదో అడగబోయాడు.

"మరింకేం కచేరీ పెట్టకు. నాకు టైమవుతోంది. సిల్లీ వివరాలు కావాలంటే మా ఇంటి దగ్గర మేడమ్‌నడుగు.."

ఇక నీ పాట్లు నువ్వు పడమన్నట్టు చూశాడు. బ్రహ్మానందం అదే ఇతర రోజుల్లో అయితే 'గెటవుట్' అని మర్యాదగా అరిచేవాడే.

నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ బైటకి నడిచాడు పట్టాభి.

ఏమయిందేమయిందని జోరిగల్లా మీదపడ్డ కొలీగ్స్‌కి తను కుక్కల వేటకి వెళ్తున్నానని చెప్పడం ఇష్టం లేక, చిన్నగా పెదవి విరిచి ఆఫీసు వదిలాడు.

బాస్ ఇంటికి వెళ్తున్నంతసేపూ కుక్కల డిటెక్షన్ గురించి చదివిన కథలన్నీ గుర్తుకు తెచ్చుకుంటూనే వున్నాడు.

సలక్షణమైన ఐడియా అయితే రాలేదుగాని బాస్ ఇల్లొచ్చేసింది.

'శునక సదన్'

గేటు దగ్గర నిల్చుని బోర్డుని మరోసారి పరిశీలనగా చూశాడు. ఎండనపడి రావటాన కళ్ళు బైర్లు కమ్మి అక్షరాలు సరిగా ఆనలేదుగానీ, ఆ బోర్డు మీద 'కనక సదన్' అని వున్నట్టు గ్రహించాడు.

బైట అలికిడేం లేదు. లోపల్నుండి మాత్రం రకరకాల ధ్వనులు వినిపిస్తున్నాయ్. బాస్ పెళ్ళాన్ని అమ్మగారూ అనాలా, మేడం అనాలా?

ఎటూ తేల్చుకోలేక చివరికి "అమ్మేడమ్" అని కేకేశాడు.

నూతిగట్టు దగ్గర నిల్చుని 'ఓ' అని అరిస్తే, ఆ శబ్దం నీటి ఉపరితలాన్ని తాకి ప్రతిధ్వని వినిపించడానికి కొంచెం సమయమన్నా పడుతుంది.

అంత టైమ్ కూడా పట్టలేదు. లోపల్నుండి చప్పున వినిపించింది. భయంకరమైన అరుపు. "చెయ్యి ఖాళీ లేదు పోవయ్యా.. అడుక్కు తినే వెధవలకి బొత్తిగా వేళాపాళా లేదు.."


బహుశా తన కేకలో అడుక్కు తినేవాడి మార్దవం ఆవిడ గారికి వినిపించిందేమో. కనీసం తన ఆకారం చూసయినా గౌరవిస్తుందేమో అనుకుని చొరవగా గేటు తెరచి లాన్‌లోకెళ్ళాడు.

"పామ్మని చెబితే నీక్కాదూ.. ఇంట్లోక్కూడా వచ్చేస్తున్నావ్. దున్నపోతులా వున్నావ్, ఏదన్నా పని చేసుకోకూడదూ"

అలాగే కళ్ళు విప్పార్చుకొని చూస్తుండిపోయాడు పట్టాభి. ఒక కారణం తను రెండోసారి కూడా ఘోరంగా పరాభవం పాలవడమైతే, మరో కారణం అక్కడ కనిపించిన దృశ్యం.

ఆవిడ చుట్టూ డజన్లకొద్దీ కుక్కలు. రంగురంగుల, రకరకాల చిన్న, పెద్దా..వాటికి ప్రేమగా చికెన్ బిర్యానీ ముక్కలు తినిపిస్తోంది.

అక్కడికి కొంతదూరంలో మరికొన్ని కుక్కలు, తింటున్న కుక్కలకేసి చొంగకారుస్తూ చూస్తున్నాయి. కుక్కల్లో రెండు వర్గాలేమిటో అర్థం కాలేదు పట్టాభికి. బహుశా వెజ్, నాన్‌వెజ్ సెక్షనేమో.



వాటిని చూడగానే కడుపు కరకరమంది. ఆఫీసుకొచ్చే హడావుడిలో ఉదయం కూడా పూర్తిగా తినలేదు. టైము ఒంటిగంట కావస్తోంది.

"ఇంకా నిలబడ్డావేం. ఫో..అవతలకి" లంచ్ పూర్తిచేసుకున్న కుక్కపిల్లకి మూతి తుడుస్తూ కసిరింది.

## వేదాంతధోరణి

**కెరీర్‌లో ఒడిదుడుకులు మామూలేకదా! అపజయాలు కలిగినచోటే గెలుపు పిలుపు విన్పిస్తుందన్నట్టుగా 'షాక్' కొంచెం షాకిచ్చినా అందాలభామ జ్యోతిక ఏమాత్రం వెరవడం లేదు. 'కెరీర్‌లో ఇలాంటివి మామూలే. నటిగా నేను నాపాత్రకి న్యాయం చేశాను. అది సరిపోతుంది నా సంతృప్తికి' అంటోంది. సినిమా హిట్ అయితే ఆనందించడం, పట్ అని తెలిస్తే బాధపడడం మంచిదికాదు. గెలుపు ఓటముల్ని సమానంగా స్వీకరించే స్థితప్రజ్ఞత మనకి కావాలి అని ఉద్బోదిస్తోందీ భామ.**

"అదికాదు మేడమ్..నేను పట్టాభి అని.." అతికష్టం మీద తనని తాను పరిచయం చేసుకుని వచ్చిన పని చెప్పాడు.

అంతే..భోరుమని ఏడుపు లంకించుకుందామె.

"పిచ్చితల్లి..ఎక్కడుందో..ఎన్ని కష్టాలు పడుతోందో. రెండేళ్ళ క్రితం మా తమ్ముడి మూడో మావగారి రెండో మేనల్లుడు స్విట్జర్లాండ్ నుండి తెచ్చిస్తే, ఈ గుండెల మీద పెట్టి పెంచుకొస్తున్నాను. ఉదయం లేచి నా ముఖం చూసిగాని, ఏ పనీ చేసేదికాదు సిల్లీ. పాలవాడు వచ్చినప్పుడు చూశానని ఆయన చెబుతున్నారుగానీ, నాకు డౌటే. ఆయనే దాన్ని ఏదో చేసి వుంటారు. మావాళ్ళ తరపు కుక్కలంటే ఆయనకెప్పుడూ ఎర్రచూపే.." ఇంకా బోలెడు కుటుంబ రహస్యాలన్నీ ఏకరువు పెట్టింది కనక మహాలక్ష్మి.

పట్టాభికి అర్థమైందేమిటంటే ఆ ఇంటి పెత్తనం ఆవిడదేగాక, ఇద్దరూ శునక ప్రియులేనని, ఇద్దరికీ చెరో వర్గం కుక్కలున్నాయని, సిల్లీని మర్నాటి ఉదయానికల్లా అప్పజెప్పకపోతే బాస్ ప్రాణాలకే ఆమె నుండి ముప్పు రావచ్చునని.

ఆఫీసులో పులిలా ఎగిరే బ్రహ్మానందంను తలచుకుంటే జాలేసింది.

ఇన్ని స్వర్గభోగాలనుభవిస్తున్న ఆ దిక్కుమాలిన సిల్లీకి ఇల్లొదిలి పారిపోవడానికి ఏం రోగం? మళ్ళీ జన్మంటూ వుంటే ఈ ఇంట్లో ఆవిడగారి తరపు కుక్కగా పుట్టాలి.

"సరే మేడమ్. సిల్లీ ఎలా వుంటుందో కాస్త చెబు

తారా?" ప్రశ్నించాడు తన ఇన్వెస్టిగేషన్‌లో మొదటి చాప్టర్ పేజీలు తెరుస్తూ. "అలాగే..మీరు, మీ సిల్లీ తీయించుకున్న ఫోటో ఏదన్నా వుంటే యివ్వండి.."

"సెపరేట్ ఫోటో లేదుగానీ, ఆ మధ్య తీయించుకున్న గ్రూఫ్ ఫోటో వుందయ్యా.. వుండు తెస్తాను" ఓ కలర్ ఫోటో తెచ్చి చూపించింది.

ఇటు ఏడు తరాలు, అటు ఏడు తరాలు..రాజ కుటుంబీకుల ఫోటోలా వుందది. ఇద్దరి చుట్టూ లెక్కలేనన్ని కుక్కలు. వాటి ఫోజులు.

నిజంగానే సిల్లీ ఆవిడగారి మెడచుట్టూ కాళ్ళేసి విలాసంగా కన్ను కొడ్తోంది.

ఆమెకి తన వైపునుండి హామీ యిచ్చి అక్కడనుండి కదిలాడు. భోజనానికి యింటికి వెళ్ళే సమయం లేదు. దార్లో ఓ హోటల్‌లో కాస్త టీ, టిఫిన్ లాగించి సరాసరి పోలీస్ స్టేషన్‌కి పోయాడు.

"ఎవరు కావాలి?" గేటు దగ్గరే ఆపేశాడో కుర్రాడు, తను బజ్జీలమ్ముకునే బండిని వదిలి వచ్చి, ఆ పోలీస్ స్టేషన్‌కి తనే ఓనర్‌నన్నట్టుగా.

"కంప్లయింటివ్వాలయ్యా?"

కోరగా చూశాడా కుర్రాడు "లోపలెవరూ లేరు.."

"ఎక్కడికెళ్ళారు?"

"కాట్లోకి..నీకెందుకయ్యా"

బొత్తిగా పదిహేనేళ్ళు కూడా లేని ఆ కుర్రకుంక దగ్గర్నుండి అంత దూకుడు సమాధానం ఊహించలేదు పట్టాభి. ఉన్న ఫళాన వాడి పీక పిసికేసి బజ్జీల మూకుడులో ఫ్రై చేసేయాలన్న కోరికని బలవంతాన ఆపుకున్నాడు.

"ఇంతకీ నువ్వెవరివోయ్.." సౌమ్యంగానే అడిగాడు. పట్టాభిని చూస్తే ఆ కుర్రాడికి కూడా కాస్త జాలి కలిగినట్టుంది.

"వచ్చేవరకు కాస్త చూస్తుండమని చెప్పి అందరూ భోజనాలకెళ్ళారు. కావాలంటే అందాక అరుగు మీద బెంచీమీద కూర్చోండి. లోనికి మాత్రం వెళ్ళొద్దు"

"మూడు దాటుతోంది. ఇప్పుడు వచ్చేస్తారంటావా?"

"ఏం చెప్పగలం? ఫ్రీగా వచ్చేదే గదా. ఏ హోటల్ వాడైనా గొడవ పెట్టుకుంటే కాస్త లేటవుతుంది."

ఈసురోమని కూలబడ్డాడు పట్టాభి.

నాలుగవుతుండగా నిక్కుతూ నీల్గుతూ వచ్చాడో కానిస్టేబుల్. ఓ కునుకు తీసి మరీ వచ్చినట్టుగా కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి.

పట్టాభి మాటలు వింటూనే అగ్గిరాముడైపోయాడు.

"మీ కుక్కల్ని, కోడి పెట్టల్ని వెదికి పెట్టడానికి మేమెలా కనిపిస్తున్నామయ్యా. ప్రతి అడ్డమైన వెధవకి పోలీసులంటే బాగా అలుసైపోయింది. అసలే కేసులతో క్షణం తీరిక లేకుండా ఛస్తుంటే.."

అరుస్తున్న అతడి నోరు పట్టాభి చేతిలో పచ్చనోటును చూస్తూనే ఠక్కున ఆగిపోయింది.

"సర్లే..వివరాలు చెప్పు"

కంప్లయింట్ ఇచ్చి బైటపడ్డాడేగానీ పట్టాభికి నమ్మకం లేదు, పోలీసులేదో వుద్ధరిస్తారని. తన ప్రయత్నాలు కూడా తను చేయాలి.

'పేపర్ ప్రకటన ఇస్తే ఎలా వుంటుంది?' ఆ ఆలోచన కూడా భేషుగ్గా వుందనిపించి పేపరాఫీసుకేసి దారితీశాడు.

తీరా అక్కడికి చేరుకున్నాక తెలిసింది, తనెంత ఫూలిష్‌గా ఆలోచించాడో. మర్నాడు ఉదయం పేపర్లోగాని రాదు ప్రకటన. అప్పటికల్లా సిల్లీ కనిపించకపోతే కనక మహాలక్ష్మి బ్రహ్మానందం తోలు వలిచి చిల్లీ పొడి చల్లుతుంది. ఆ తర్వాత బలయిపోయేది తను.

రాత్రి ఏడు గంటలవుతోంది. అనవసరంగా టైమంతా అక్కడా ఇక్కడా వేస్ట్ చేసేశాడు. ఇంతవరకు తను ఇన్వెస్టిగేట్ చేసిందేముంది?



ఓవైపు చీకటి తెరలు కమ్మేశాయి. ఈ రాత్రివేళ ఎక్కడ వెతగ్గలడు? తనకిచ్చిన గడువు ముగియడానికి ఇంకో పది పన్నెండు గంటలు మాత్రమే వుంది.

పట్టాభికి కాళ్ళు, చేతులు ఆడటం లేదు. తనని తాను తెలిసిన భారతీయ భాషల్లోనూ బండ బూతులు తిట్టుకున్నాడు.

ఓవైపు కాళ్ళు లాగేస్తున్నాయి. చచ్చేంత నీరసంగా వుంది. బొత్తిగా కుక్క బ్రతుకైపోయింది తనది. ఒక కుక్కను పట్టుకోడానికి కుక్కపాట్లు పడుతున్నాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది..ఒకవేళ మున్సిపాలిటీ వాళ్ళుగాని కుక్కల బండిలో వేసుకుపోయారేమో. అదే నిజమైతే బాస్‌నీ, తనని ఆ దేవుడు కూడా కాపాడలేడు. ఆశ చావక మున్సిపల్ ఆఫీసు వైపు పరిగెత్తాడు.

చుట్ట పీల్చే తన్మయత్వంలో మునిగిపోయిన వాచ్‌మాన్‌కి పట్టాభి పిలుపు ఓ పదినిమిషాల వరకు చెవికెక్కలేదు.

పట్టాభి అవసరాన్ని గ్రహించి నిస్సంకోచంగా చేయి చాపేశాడు. ఓ పదినోటు కొట్టాక పెదవి విప్పాడు. "ఈవేళ కుక్కల్నేం తేలేదు బాబూ.."

తలపట్టుకొని భోరుమని ఏడవాలన్నంత పిచ్చిగా వుంది. అతడి వాలకం చూసి సలహా ఇచ్చాడు వాచ్‌మాన్.

"ఆ ఇంటికి ఆ పక్కోళ్ళనీ, ఈ పక్కోళ్ళని అడగలేకపోయావ్"

పట్టాభిలో ఛస్తున్న ఆశ జీవం పోసుకుంది. నిజమే. ఆ ఐడియా ఇంతవరకు తనకెందుకు రాలేదు?

మళ్ళీ మొదటికే వచ్చింది కథ.

బాస్ పక్కింట్లో అరుగు మీదే ఎదురయ్యాడో

## అందాల పున్నమి

**ప్రభుదేవా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పౌర్ణమి చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంది. ఇప్పటికే ఈచిత్రం ఆడియో విడుదలైంది. త్రిష, ఛార్మి హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈచిత్రంకి సంబంధించిన అరకువ్యాలీలో పాటల చిత్రీకరణ జరిగింది. క్లైమాక్స్ కూడా పూర్తయిందని ఈచిత్రాన్ని ఈఏప్రిల్ 20న విడుదల చేస్తున్నట్టు నిర్మాత ఎం.ఎస్.రాజు చెబుతున్నారు. ఇరువురు భామలు చేసే అందాలవిందు ఈ పౌర్ణమిని ఏమేరకు సక్సెస్ చేస్తుందో చూడాలి మరి!**

వ్యక్తి. పట్టాభిని చూస్తూనే సాదరంగా పిలిచి మంచం అంచున కూర్చోబెట్టుకున్నాడు.

ఖళ్ళు ఖళ్ళున ఓ పావుగంట దగ్గి, "ఏమిటో నాయనా.. ఊరు పొమ్మంటోంది..కాడు రమ్మంటోంది. ఈ బొందిలో ప్రాణం మాత్రం పోనంటోంది" ఆగి ఆయాసం తీర్చుకోసాగాడు తాత.

అతడి వాలకం పట్టాభికి అనుమానం కలిగిస్తోంది.

"తాతగారూ..నేనెందుకొచ్చానంటే.."

"తెలుసు నాయనా..ఆ పరమాత్ముడికి నాయందు దయ వుంది. ఈ ముసలి వయసులో నేనెలా వున్నానో చూసి పొమ్మని ప్రభువే పంపి వుంటాడు."

"అది కాదండీ..కుక్క"

"కుక్కేమిటి, నక్కేమిటి నాయనా. అంతా ఆ పైవాడి లీల. ఈ దగ్గుతో నన్నీ భూమ్మీద ఇంకా వుంచాడంటే ఏదో ప్రయోజనం వుండే వుంటుంది..ఖళ్..ఖళ్"

'అవునవును. నువ్వేదో దేశాన్నుద్ధరించే ప్రయోగాలు చేసి నోబుల్ బహుమతి కొట్టేస్తావని' కసిగా అనుకున్నాడు పట్టాభి.

"అసలీ మానవ జన్మకి సార్ధకత ఎప్పుడో తెలుసునా నాయనా. పరోపకారార్ధ మిదం శరీరం అన్న నిజాన్ని గ్రహించి ఆచరించిన నాడే..గీతలో శ్రీకృష్ణభగవానుడేమన్నాడు"

మరి కాసేపు అక్కడుంటే తనకి పిచ్చెక్కడం ఖాయమని లేచి నిల్చున్నాడు.

"అప్పుడే వెళ్తున్నావా. ఓ సహాయం చేసి పెట్టు నాయనా. దగ్గుకి మందేమన్నా నీకు తెలుసా. ఖళ్..ఖళ్" ప్రేమగా పట్టాభి తల నిమిరాడు.

"ఎందుకు తెలీదు? సగ్గుబియ్యంలో ఎండు చేపలు వేసి జావకాచి వడబోసి రోజూ పదహారుసార్లు తాగండి.. ఫినిష్" కోపంగా అనేసి బయటపడ్డాడు పట్టాభి.

ఇక అటువైపు ఇంటి వ్యక్తి ఏ టైపో.

బితుకు బితుగ్గానే కేకేశాడు. అరగంటసేపు అరిస్తేగాని ఎవరూ బైటకు రాలేదు.

"ఎవడివయ్యా నువ్వు. కాలుగాలిన కుక్కలా అదే పనిగా అరుస్తావ్" బైటకు వస్తూనే పట్టాభి మీద విరుచుకుపడిపోయాడో బట్టతల శాస్త్రీ.

"అది కాదండీ..నేనూ..పక్కింటి కుక్క" పట్టాభి నోట మాట పూర్తిగా రానేలేదు, పళ్ళు రాలగొట్టేంత కోపంతో పైపైకి వచ్చేశాడు.

"నోర్ముయ్. తిక్క తిక్కగా వాగకు. నువ్ పక్కింటి కుక్కవేమిటి? ఆ కుక్కవెధవ రోజూ ఇలాగే వెళ్తాడు. నాకు బాగా తెలుసు."

"ఆయన కుక్క కాదు సార్. మా బాస్. వాళ్ల సిల్లీ తప్పిపోయిందంటే వెదకడానికి వచ్చేను. మీరేమన్నా చూశారేమోనని"

"వాడ్డాయూ మీన్..నేనేమన్నా కుక్కల్ని కాసేవాడిలా కనిపిస్తున్నానా? ఛ..బొత్తిగా ప్రాణాలకి సుఖం లేకుండా ఛస్తున్నాను. రాత్రులు ఆ దిక్కుమాలిన కుక్కల అరుపులతో నిద్రపట్టి చావదు. దానికితోడు ఆ పక్కన ముసలాడు దగ్గులతో చంపుతాడు. ఇప్పుడు ఎంక్వైరీలు కూడా తేడయ్యాయి" తలపట్టుకొని ఓ రెండు నిమిషాలు నిశ్శబ్దంగా 'యోగా' లాంటిదేదో చేసి, ఆ పై ఓ కన్ను నిర్నిమేషంగా తెరచి, "నేను ఇందాక నిన్నేమన్నా తిట్టానా బాబూ" అన్నాడు అప్పుడే తపస్సు నుండి వస్తున్న ముని పుంగవుడంత ప్రశాంతంగా.

కాస్త కలవరంగా చూశాడు పట్టాభి "అబ్బే..లేదండీ.."

"తిట్టే వుంటానులే బాబూ..నువ్వొచ్చేసరికి టీవీలో ప్రోగ్రాం చూస్తున్నాగదా..ఏదో గీరగీరగా వుంటుంది. ఏం అనుకోకేం? ఏమడిగావ్..పక్కింట్లో కుక్క తప్పిపోయిందా..నేను చూడలేదయ్యా. మా అబ్బాయిగాని చూశాడేమో. రోజూ ఉదయం జాగింగ్ కెళ్తుంటాడు"

పట్టాభిలో ఆశ తళుక్కుమంది. "మీ అబ్బాయిని పిలుస్తారా కాస్త!"

"వాడింట్లో లేడు బాబూ.."

"ఎప్పుడొస్తాడు?"

"ఈకాలం పిల్లలు ఇంటికెప్పుడు చేరుతారో ఎవరు చెప్పగలరు బాబూ"

ఈలోగా కాస్త టీ చుక్కయినా తాగి వద్దామని బయల్దేరాడు పట్టాభి. రాత్రి పదిన్నరయిపోతోంది. వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి...

'కథా... కొంప ముంచావు కదే' అని ఎన్నిమార్లనుకున్నాడో లెక్కే లేదు. అతడికెంత కోపంగా వుందంటే, కుక్క కనిపిస్తే కుక్కర్లో పెట్టి ఉడకేసేయాలన్నంత కసిగా వుంది.

"హలో.." ఆడగొంతు వినిపించి ఉలిక్కిపడి చూశాడు. కరెంట్ పోల్ క్రీనీడలో వున్న ఆకారం తననే పిలుస్తోంది. ఆమె ఎవరో అర్ధమయ్యేసరికే తన చేయి ఆమె చేతిలో చిక్కుపడిపోయింది.

"ఏమిటలా బిత్తరపోతావ్. నీకిదే ఫస్ట్ టైమా..చాలా చవక..పాతిక రూపాయలే..లాడ్జింగ్ కొద్దులే. మా యింటి కొచ్చేయ్"

"అయ్యో నేనలాంటివాడిని కానండీ..నాకు పెళ్ళయింది. పిల్లలు కూడా వున్నారు. ప్లీజ్ వదిలేయండి" ఆమెను వదిలించుకుని ఒకటే పరుగు.

ఇరానీ హోటల్లో టీ కొడ్తుండగా పట్టాభికి రామ్మూర్తి గుర్తుకొచ్చాడు. అతడి దగ్గర 'కుక్కల సైకాలజీ' గురించి పుస్తకమేదో వున్నట్టు గుర్తు. అతడేమన్నా సలహా చెప్పగలడేమో. ఆ ఆశతోనే రామ్మూర్తి ఇంటి తలుపు తట్టాడు.

"ఏంటి గురూ..అర్ధరాత్రి మద్దెల దరువు. కావాలంటే పుస్తకమిస్తాను. తీసుకెళ్ళి చదువుకో" ఆ రాత్రిని ఒక్క నిమిషమైనా వృధా చేయకూడదన్నట్టు, పుస్తకం పడేసి దఢాల్న తలుపు వేసేశాడు రామ్మూర్తి.

మనసు చివుక్కుమన్నా చేసేదేం లేక, ఆ తిక్క వ్యక్తి కొడుకేమన్నా ఇంటికొచ్చాడేమోనని మళ్ళీ వెనక్కి వచ్చాడు పట్టాభి. ఈసారి అతడి అదృష్టం బాగుంది. వివరాలన్నీ చెప్పాక, ఆ కుక్క పక్కవీధి మలుపు తిరుగుతుండగా చూశానని కాస్త క్లూ ఇవ్వగలిగాడు ఆ కుర్రాడు.

అర్ధరాత్రి దాటిపోయింది. మళ్ళీ వీధినపడ్డ పట్టాభి భుజమ్మీద బరువుగా అనిపించి గిర్రున వెనుతిరిగి చూశాడు.

"ఏ ఇంట్లో దొంగతనానికి బయల్దేరావు బే.." తమ సహజసిద్ధమయిన మార్దవంతో లాఠీతో డొక్కలో పొడిచాడు ఓ ఎర్రటోపీవాలా. అసలే నీరసంగా వున్నాడేమో, ముప్ఫయి ఆరు గింగిర్లు తిరిగాడు పట్టాభి.

"అబ్బే నేను దొంగతనానికి రాలేదు. నేను దొంగనూ కాదండీ. తప్పిపోయిన కుక్క కోసమని.." పట్టాభికి ఏడుపొక్కటే తక్కువ.

"వాలకం చూస్తే కాస్త చదువుకున్నవాడిలాగే కనిపిస్తున్నాడు. అయితే మనకేమిటట. మొన్నటి చోరీ కేసులో ఇరికించి బొక్కలో పడేస్తే కేసు క్లోజయిపోతుంది. మనకి ప్రమోషన్ ఛాన్సూ వస్తుంది" వికృతంగా నవ్వాడు రెండో ఎర్రటోపీ.

చప్పున వాళ్ళ కాళ్ళమీద పడిపోయి తన దీన కథంతా గుండెలు కరిగేలా వివరించి చెప్పాక కాస్త మెత్తబడి వదిలేశారు.

టైమ్ గడిచిపోతోంది. సిల్లీ జాడ తెలియలేదు. ఇన్ని కష్టాలు పడ్డాక ఇక ఆ దరిద్రగొట్టు కుక్క ఎక్కడున్నాసరే వెదికి పట్టుకుని డొక్కలో తంతేగానీ తన కసి తీరదు...

వీధి లైటు వెలుతురులో 'కుక్కల సైకాలజీ' పేజీలు తిరగేస్తున్న పట్టాభి ఓ చోట ఆగిపోయాడు. అక్కడ వ్రాసింది, ఆ కుర్రాడు చెప్పింది నిజమైతే సిల్లీ తన చేతికి చిక్కినట్టే. ఈ శునక భాగోతానికి తెరపడ్డట్టే.

ఓవైపు తెల్లారిపోవస్తోంది.

పక్క వీధిలోకి పరిగెత్తిన పట్టాభి శ్రమ ఫలించింది.

అక్కడ.. పెంటకుప్ప మీద సదరు సిల్లీగారు ఊరకుక్కల సన్నిధిలో అరమోడ్పు కన్నులతో..

శునకానందమన్న.. మాట ఎలా పుట్టిందో తెలిసింది పట్టాభికి. పట్టుపరుపుల్ని వదిలి పెంటకుప్పల్నే ఇష్టపడి వచ్చిందంటే..

బాస్ ఎక్కడ పప్పులో కాలేశాడో అర్ధమైంది. అన్నీ మగ కుక్కల్నే పెంచుతున్నాడు. వయసొచ్చిన కుక్కకి కావలసినదేమిటో మరచిపోయాడు. ఈ లెక్కన చూస్తే మిగతా కుక్కల్లో కూడా విప్లవం రావడానికి ఎంతో కాలం పట్టదు.

ఆఖరి నిమిషంలోనైనా సిల్లీని పట్టుకోగలిగినందుకు ఆనందం కలిగి, ఆ ఆనందంలో మరో సంగతి మరచిపోయి సిల్లీ దగ్గరకి పోయాడు.

తన రొమాంటిక్ మూడ్‌కి భంగం కలిగిస్తే ఏ కుక్క మాత్రం సహించగలదు? కళ్ళెర్ర జేసి గుర్రుగుర్రున చూస్తూ ఒక్క ఎగురు ఎగిరి పట్టాభి పిక్క పట్టేసింది సిల్లీ.

అప్పుడు పట్టాభి పెట్టిన కేక వింటే, హార్ట్ ఎటాక్ వున్న వాళ్ళు గుండాగి చచ్చిపోవాల్సిందే.

ఇప్పుడు పట్టాభి కళ్ళముందు గతరోజు పేపర్లో చదివిన వార్తే గిర్రున తిరుగుతోంది.

'కుక్కకాటుకి ముగ్గురి బలి'

ఇక ఉపేక్షించలేదు పట్టాభి. బ్రతికుంటే బలుసాకు తిని వుండొచ్చు.

'యాంటీ- ర్యాబిస్ ఇంజక్షన్' దొరికే డాక్టర్ కోసం పరిగెత్తాడు.